## ప్రశ్నలు & సమాధానాలు
## ప్రశ్న 315: వాసనలు, గుణాలలో పరివర్తన
## ఏప్రిల్ 13, 2024

ఈ ప్రశ్న-సమాధానాలు ప్రొ. అనిల్ కుమార్ గారి సత్యోపనిషద్, సంపుటం 1, పేజీలు 145-150 నుండి తీసికొనబడినవి

**స్వామి! పూర్వ జన్మల వాసనలు, సంస్కారాలు ఈ జన్మలోకి కూడా తీసుకొస్తామని వింటూ ఉంటాము. అది నిజమేనా స్వామి? అది ఎలా జరుగుతుంది?**

భగవాన్: తప్పకుండా! అకౌంట్ బుక్కులో ముందు పేజీలోని ఖాతా బాకీ తరువాతి పేజీకి ఎలా తీసుకొస్తామో, పూర్వ జన్మ సంస్కారాలు ఈ జన్మకు వస్తాయి.

ఒక అగరబత్తినో, కర్పూరాన్నో వెలిగిస్తే దాని వాసన గది అంతా వ్యాపిస్తుంది కదా? దుర్గంధము కూడా అలాగే వ్యాపిస్తుంది. అదే విధంగా పూర్వ జన్మల వాసనలు వచ్చే జన్మలకు కూడా వస్తాయి.

**స్వామి! పూర్వ జన్మ వాసనలు మాలో ఎలా వస్తాయి? పుడతాము, పెరుగుతాము, మరణిస్తాము. దేహము క్షీణించి, మరణించి, నశించిపోతుంది. కనుక మా లక్షణాలు వచ్చే జన్మలోకి ఎలా వెళ్తాయి?**

భగవాన్: పూర్వ జ్జన్మ లక్షణాలు తప్పకుండా వచ్చే జన్మలకు వెళ్తాయి. వాటిని వాసనలనొచ్చు, లేక సంస్కారాలనొచ్చు, లేక పూర్వ జన్మ లక్షణాలనొచ్చు. మంచి సంస్కారములుండే వాళ్ళు వారి సమయాన్ని సత్సంగం, భజనలు, సదాలోచనలు, సత్కర్మల వంటి పవిత్రమైన మార్గంలో వినియోగించుకుంటారు.

కానీ చెడు సంస్కారాలుండే వారు వారి సమయాన్ని దుష్కర్మలు, దుర్భావనలు, అసత్యము వంటి అపవిత్రమైన మార్గములో వృధా చేసుకుంటారు. దేహము క్షీణించి, మరణించి, నాశనమై పోయినా కూడా ఈ సంస్కారాలు చావవు. పై జన్మకి వెంటాడతాయి.

ఒక చిన్న ఉదాహరణ. నీ చేతికి గాయం తగిలితే వైద్యానికి వెళ్తావు. కొన్ని రోజులు ఆ గాయమైన చోటు కట్టు కడతావు. ఇంకొన్ని రోజులకి ఆ గాయం నయమైపోతుంది. కానీ ఆ చోటులో మచ్చ పడి, ఎన్ని రోజులైనా అలాగే ఉండిపోతుంది. అదే విధంగా దేహము మరణించవచ్చు. కానీ వాసనలు వచ్చే జన్మ వరకూ కూడా ఎక్కడికీ పోవు.

**స్వామి! రజో, తమో గుణములు మానవుని బంధిస్తాయని వింటాము. సత్త్వ గుణము కూడా మానవుని బంధిస్తుందా?**

భగవాన్: ఈ మూడు గుణాలు మానవుని బంధిస్తాయి. మీ జీవితమే వాటిచే నిబంధింపబడి ఉంటాయి. అవి మీ భావాలు, క్రియలను పరిపాలిస్తుంటాయి. మీ నడత, ప్రవర్తనలు వాటి పర్యవేక్షణ లోనే జరుగుతుంటాయి. సాత్త్విక గుణాలు కూడా మిమ్మల్ని బంధిస్తాయి.

ఉదాహరణకు, నిన్ను ఇనుప సంకెళ్ళతో కట్టివేస్తే అది బంధనమే కదా? వెండి సంకెళ్ళతో కట్టేసినా అది బంధనమే. వచ్చే సారి బంగారపు సంకెళ్ళతో కట్టబడితే అది కూడా బంధనమే. ఈ మూడు రకాల సంకెళ్ళకు తేడా అవి తయారు చేయబడిన లోహము మాత్రమే. కానీ విలువలో తేడా ఉన్నా, మూడూ సంకెళ్ళే. అలాగే గుణాలు మూడు కూడా నిన్ను బంధింపచేస్తాయి.

ఇనుప సంకెళ్ళను మంద బుద్ధి అయిన తమో గుణముతో పోలిస్తే, వెండి సంకెళ్ళు ఆవేశం, ఉద్రేకం వంటి రజో గుణముతో పోల్చవచ్చు. బంగారు సంకెళ్ళు నిర్మలమైన, పరిశుద్ధమైన సత్త్వ గుణంతో సమానం. కానీ దైవత్వమనేది ఈ మూడు గుణాలకు అతీతమైనది. అంటే నిర్గుణ స్వరూపం.

**స్వామి! మాకు సత్త్వ, రజో, తమో గుణములు వంటివి ఎన్నో ఉంటాయి. అవి ఎప్పుడైనా మారతాయా? మేము ఉన్నతి స్థాయికి ఎలా చేరగలము? ఈ గుణాల వల్ల కొన్ని సార్లు ఆఫీసులో వారితో గొడవలు రావొచ్చు. ఇలాంటి పరిస్థితులలో ఏమి చేయాలి? ఇటువంటి సమస్యలకు పరిష్కారం చూపించండి.**

**భగవాన్:** ప్రపంచమంతా ఈ సత్త్వ, రజో, తమో గుణములనే మూడు గుణాల చుట్టూ తిరుగుతుంది. ప్రతి మానవునిలో కూడా ఈ మూడు గుణాలు ఫ్యానులోని మూడు రెక్కల వలె పని చేస్తుంటాయి. కానీ మానవునిలో ఏ గుణమైతే ప్రబలమై ఉందో ఆ గుణము అతని వ్యక్తిత్వాన్ని, అతని ప్రారబ్ధమును కూడా నిర్ణయిస్తుంది.

సాత్త్విక గుణము అధికంగా ఉంటే అతనికి భక్తిశ్రద్ధలు ఎక్కువగా ఉంటాయి. రాజసిక గుణము ఎక్కువ పాళ్ళలో ఉంటే అతనికి ఆవేశం, ఉద్రేకం వంటివి ఎక్కువగా ఉంటాయి. తామసిక గుణము యొక్క ప్రాబల్యము ఎక్కువగా ఉంటే మంద బుద్ధివాడు అవుతాడు. అందరికీ ఈ గుణాలు ఉంటాయి.

ఉదాహరణకు, కనుగ్రుడ్డులో తెలుపు, ఎరుపు, నలుపు అనే మూడు రంగులు ఉంటాయి కదా? అవి త్రిగుణాలతో పోల్చవచ్చు. సూర్యోదయములో కూడా ఈ త్రిగుణాలను సూచించే తెలుపు, ఎరుపు, నలుపు రంగులుంటాయి. ఇక్కడ ఒక ముఖ్యమైన విషయం తెలుసుకోవాలి. ఈ గుణములకు స్వతంత్రమైన ఉనికి ఉండదు. దైవత్వము యొక్క ఆధారముంటేనే ఇవి ఉనికిలోకి వస్తాయి. కానీ దైవత్వములో ఈ గుణాలు ఉండవు, అంటే భగవంతుడు గుణాతీతుడు.

గుణములలో పరివర్తన రావొచ్చు. ఉదాహరణకు, తామసిక గుణమును కర్మలు చేసి జయించవచ్చు. కర్మ వల్ల తామసిక గుణము రాజసిక గుణంగా మారుతుంది. రాజసిక గుణము వల్ల ద్వంద్వ ఫలితాలకు అవకాశముంది. రాజసిక గుణము వల్ల పొగడ్తలు రావొచ్చు, నిందలు రావొచ్చు. జయాపజయములు కలగవచ్చు, లేక లాభనష్టాలు కలగవచ్చు.

మానవుడు కర్మలు చేయవలసిందే. కర్మలలో పాల్గొనని వారు ఎవరూ లేరు. మంచం మీద పడుకుని నిద్ర పోతున్నా సరే నీ గుండె కొట్టుకుంటూనే ఉంటుంది, నీ రక్తం ప్రవహిస్తూనే ఉంటుంది, నీ ఊపిరితిత్తులు, నాడీమండలము పని చేస్తూనే ఉంటాయి. ఇదంతా కర్మే కదా?

నిస్వార్థ కర్మలను చేసి, వాటి ఫలితాలను భగవంతునికి అర్పితం చేసి, అందరిలో ఉన్న అంతరాత్మ దైవమేనని గుర్తిస్తే, అనుభవజ్ఞానము ఏర్పడుతుంది. అప్పుడు రాజసికంగా ఉండే వాడు సాత్త్వికుడు అవుతాడు.

అందుచేత కర్మ ముఖ్యము. కర్మానుబంధీని మనుష్య లోకే, అంటే మానవ సమాజం కర్మతో బంధింపబడింది. నీ జన్మయే కర్మకు దానం ఇవ్వబడింది. కనుక జన్మ, కర్మ అంతస్సంబంధం కలిగినవి. అందుచేత మనము చేసే కర్మలకు వందనం చేయాలి. తస్మై నమః కర్మణే, అంటే 'నాకు అందించిన కర్మకు నా నమస్కారములు'.

కనుక తామసిక గుణమును కర్మలతో రాజసిక గుణముగా మార్చవచ్చు. దాన్నే భక్తి జ్ఞానములతో సాత్త్విక గుణముగా మార్చుకోవచ్చు. దీనినే సాధన అంటారు.

ఆత్మవిచారణతో నీ గుణమును మార్చుకోవచ్చు. మనసు చలించడం, ఎక్కువగా నిద్ర పోవడం, ఎక్కువగా తినడం వంటి పశు లక్షణాలు నీలో కనిపిస్తే, "నేను మనిషిని. పశువును కాను" అని మనసులో కనీసం ఒక పది సార్లు తలచుకో. అప్పుడు అటువంటి లక్షణాలను జయించవచ్చు.

నీ కర్తవ్యమును శ్రద్ధతో నిర్వర్తించు. ఆడంబరాలకు పోవద్దు. ప్రదర్శనలు, టెక్కులు చేయొద్దు. నువ్వు చేసే పని ఇంకెవరూ చూడకపోయినా భగవంతుడు చూస్తాడని మర్చిపోవద్దు. నీ కర్తవ్యమును ప్రేమతో నిర్వర్తించు.

ప్రేమతో కర్తవ్యం నిర్వహించడం మనోహారం
ప్రేమ లేకుండా కర్తవ్యం శోచనీయం
కర్తవ్యం లేకుండా ప్రేమ దైవత్వం

నువ్వు చేసే కర్మలను, వాటి ఫలితాలను అన్నిటినీ భగవంతునికి అర్పిస్తే నీవు చేసే పని పూజగా మారిపోతుంది.

నీ ఆఫీసులోని తోటి ఉద్యోగులతో పడకపోవచ్చు. వారి మనస్తత్వము నీ మనస్తత్వము కంటే భిన్నంగా ఉండవచ్చు. దాంతో గొడవలు, కలహాలు వచ్చి మనశ్శాంతి కోల్పోవచ్చు. అందుచేత ఎక్కువ మందితో స్నేహాలు చేయొద్దు. "Hello, hello, how are you, how are you, goodbye, goodbye" అంతే.
ఈ నాడు నిజమైన సంఘ సేవ ఎక్కడా కనబడదు. అన్నీ showకి చేసే సేవ, లేకుంటే slow సేవ. నువ్వు చేసే సేవ ఎవరి కొరకో కాదు. నీ మనస్తృప్తి, నీ సంతృప్తి కొరకు మాత్రమే చేయి. ఏది చేసినా నీ అంతరాత్మ తృప్తి చెందేటట్లు చెయ్యి. ఎవరెవరినో మెప్పించడానికి ఏ పని చేయొద్దు. భగవంతుడే నీ అంతరాత్మ. శీలము అనేది అత్యంత ముఖ్యమైనది. దానిని ఎప్పుడూ కోల్పోవద్దు.

జీవితంలో విజయం సాధించాలంటే cooperation అవసరం. కానీ ఈ నడుమ operation మాత్రమే కనబడుతుంది.

వచ్చే వారం స్వామి వారి మరి కొన్ని ఉపదేశములతో మళ్ళీ కలుద్దాం. ధన్యవాదములు.

ఓం శ్రీ సాయి రామ్